సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



కొత్త చెరువు పరిశీలన
మహేశ్వరం మండల పరిధిలోని కొత్త చెరువును సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 10లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు
అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వివిధ అంశాలపై వచ్చిన ఫిర్యాదులను డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ అంశాలపై 35 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి



హాజిపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్: కంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హాజిపల్లిలో నిర్వహిస్తున్న శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డుల పరిశీలన అనంతరం శిబిరానికి వచ్చిన వారికి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా ఆరోగ్య సిబ్బంది విధిగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు శిబిరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని శిబిరాలకు తరలించాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం తగదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. నాగులపల్లిలో నిర్వహిస్తున్న శిబిరాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇస్నాతి మౌనిక, డాక్టర్లు రమాదేవి, జయప్రకాష్, వైద్య సిబ్బంది ఆనంద్, తుకారాం, భారతి, అశ్విని, సుజాత, సుమతమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ జిల్లా మహాసమ్మేళనం ఈనెల 8న ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ సంఘం నేతలు సోమవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

సాక్షి, సిటీబ్యూరో: 'దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర డైరీ 2023'ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోమవారం అసెంబ్లీ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఉద్యోగ సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రమోషన్స్‌లో రిజర్వేషన్లను మూడు నుంచి నాలుగు శాతానికి పెంచే జీవో అతి తొందరలోనే తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చిట్టిబాబు, దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ హాబీబియా, ప్రధాన కార్యదర్శి కోలా సైదులు ముదిరాజ్, కోశాధికారి ఐ.రోషన్, నల్లగొండ శ్రీనివాసులు, బొల్లం మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాంబశివరావు, ఈ.తిరుపతి, కే వేద కుమారి తదితరులు పాల్గొన్నారు.

కేటా'యింపు' కొంతే..





జిల్లాకు ప్రత్యేకంగా లేని వరాలు
- ఎయిర్‌పోర్ట్ మెట్రోకు నిధులు
- మహేశ్వరంలో పాలిటెక్నిక్ కళాశాలకు గ్రీన్ సిగ్నల్
- కోకాపేటలో సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్
- 'పాలమూరు-రంగారెడ్డి'కి లేని కేటాయింపులు

తుర్కయంజాల్: అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేకంగా వరాలు కురిపించకపోయినప్పటికీ శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్ నిర్మాణానికి నిధులు కేటాయించారు. మహేశ్వరంలో పాలిటెక్నిక్ కళాశాల, కోకాపేటలో సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ పైలెట్ ప్రాజెక్ట్‌కు పచ్చజెండా ఊపారు. సొంత జాగా ఉండి ఇల్లు లేని నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించడం ఊరటనిచ్చింది. సమస్యలతో సతమతమవుతున్న జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఎంత వరకు మేలు చేకూరనుందో త్వరలో తేలనుంది.

ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు
- ఇల్లు లేని నిరుపేదలకు సర్కారు తీపి కబురు అందించింది. ఇప్పటికే జిల్లాలో లక్ష మందికి పైగా డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా 6,777 ఇళ్లకు మాత్రమే పాలనా అనుమతులు దక్కాయి. కేవలం 2,445 పూర్తయ్యే దశలో ఉన్నాయి. ప్రభుత్వం బడ్జెట్‌లో సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికి నిర్మాణం కోసం రూ. 3 లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించడంతో పలువురికి ఊరట లభించనుంది.
- ప్రభుత్వం సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తూ మహేశ్వరంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించనుంది.
- మధ్యాహ్న భోజన పథకంలో వంటపని చేస్తున్న వారికి నెలకు కేవలం రూ.1000 మాత్రమే వచ్చేవి. ఈ బడ్జెట్‌లో రూ. 3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి మేలు చేకూరనుంది.
- నగర శివారు ప్రాంతమైన ఎల్బీనగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనేది ప్రభుత్వ లక్ష్యం. బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.
- జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రారంభించిన బస్తీ దవాఖానాలు విజయవంతం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఏఎన్‌ఎం సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించడంతో ప్రజలకు సత్వర వైద్య సేవలు అందనున్నాయి.
- స్థానిక సంస్థలకు ప్రభుత్వం విడుదల చేసే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి నిధులతో పాటు ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా స్థానిక సంస్థల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయాలని సీఎం నిర్ణయించారు. దీంతో స్థానిక సంస్థలు ఫైనాన్స్, ట్రెజరీల ఆమోదం కోసం వేచి చూడకుండా సొంతంగా నిధులు వినియోగించుకునే అవకాశం లభించనుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, పంచాయతీల పాలకవర్గాలకు పని సులభం కానుంది.
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు రాగానే పనులు పూర్తి చేసి జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృష్ణా జలాలను అందిస్తామని పేర్కొన్నారే తప్ప ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు.
- కోకాపేట లే అవుట్‌లో పైలెట్ ప్రాజెక్ట్ కింద సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్‌ను నిర్మించేందుకు రూ.95 కోట్లు కేటాయించారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు ప్రాధాన్యం
శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏడాదికి 4 కోట్ల మంది ప్రయాణం చేసినా సరిపడేలా విమానాశ్రయ విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నలుమూలల నుంచి విమానాశ్రయానికి త్వరగా చేరుకోవడానికి రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు (31 కి.మీ) రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులు రూ.6, 250 కోట్లతో నిర్మించనున్న మెట్రో పనులకు ఇటీవల సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాయించడంతో పనులు ప్రారంభం కానున్నాయి. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా బడ్జెట్


విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో రూ. 19,093 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. ఇది పూర్తిగా ప్రజా, సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ కలల సాకార బడ్జెట్. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపు రేఖలు మారనున్నాయి. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించడం ద్వారా సమస్యలు పరిష్కారం కానున్నాయి. – సబితారెడ్డి, విద్యా శాఖ మంత్రి

హర్షణీయం


బడ్జెట్‌లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి రూ.13, 645 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో నిర్మాణం పనులను మూడేళ్లలో పూర్తి చేస్తాం. పర్యావరణ అనుమతులు మంజూరు కాగానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేసి నీటి సమస్యను పరిష్కరిస్తాం. – రంజిత్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ

సబ్బండవర్గాల బడ్జెట్



ఇబ్రహీంపట్నం: బడ్జెట్ సబ్బండ వర్గాల సంక్షేమానికి ఊతమిచ్చేలా ఉంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెలంగాణపై వివక్ష చూపిస్తున్నా ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్ ప్రవేశపెట్టాం. వ్యవసాయరంగానికి రూ.26,831 కోట్లు, ప్రాజెక్ట్‌లకు రూ.27వేల కోట్లు, రుణమాఫీకి రూ.6,385 కోట్లు ప్రతిపాదించి మరోసారి కేసీఆర్ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేసింది. – మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే

అంకెల గారడీ


2022 బడ్జెట్‌లో సొంత ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇస్తామని చెపికేవలం అంకెల గారడీ బడ్జెట్ మాత్రమే. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను మభ్య పెట్టడానికి తయారు చేశారు. పన్నుల రూపంలో అత్యధిక ఆదాయం వచ్చే జిల్లాను పూర్తిగా విస్మరించారు. పాలమూరు- రంగారెడ్డికి నిధుల ఊసే లేదు. – బొక్క నర్సింహా రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నిరుద్యోగ భృతి ఏదీ?


అప్పుల వడ్డీ చెల్లించడానికి రూ.28,480 కోట్లు కేటాయించారు. అంటే బడ్జెట్‌లో అధిక శాతం రుణాల వడ్డీకే పోతోంది. ఎన్నికలకు ముందు ప్రకటించిన నిరుద్యోగ భృతి ఊసే ఎత్తలేదు. గిరిజన బంధు అమలుకు నిధులను కేటాయించలేదు. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు అంతంతే. – ఓరుగంటి యాదయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

ప్రజలను మరోసారి మోసం



మహేశ్వరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిలా ఉంది. ఎలక్షన్ స్టంట్‌ను తలపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా వంచించేలా రూపొందించారు. దళిత బంధు, గృహ నిర్మాణ శాఖ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సరిగ్గా నిధులు కేటాయించలేదు. అంతా ఒట్టి డబ్బాలా ఉంది. – చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

సంక్షేమానికి అధిక ప్రాధాన్యత


ఆమనగల్లు: బడ్జెట్‌లో సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేనట్లు నిధులు కేటాయించారు. ఆసరా పింఛన్ల కోసం రూ.12 వేల కోట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు రూ.3,210 కోట్లు, దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు, బీసీ సంక్షేమం కోసం రూ.6,229 కోట్లు కేటాయించారు. – కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ

విద్యారంగంపై చిన్నచూపు


చేవెళ్ల: ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగాన్ని ఆనవాయితీగా మరోసారి విస్మరించారు. రూ.19,093 కోట్లు (6.57శాతం) మాత్రమే కేటాయించి నిరుత్సాహ పరిచారు. ఇది అత్యంత శోచనీయం. దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యారంగాన్ని విస్మరించడం సిగ్గుచేటు. – రాజేశ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అభివృద్ధికి అగ్రతాంబూలం


కందుకూరు: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోంది. ఎనిమిదిన్నరేళ్లలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారు. కేంద్రం ఆటంకం కల్పిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొక్కవోని దీక్షతో ఆటుపోట్లను తట్టుకుని అభివృద్ధిలో పయనిస్తోంది. – పాండురంగారెడ్డి,గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



మంత్రి హరీశ్‌రావుతో మంత్రి సబితారెడ్డి



అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, జైపాల్ యాదవ్



ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

పండ్ల మార్కెట్‌ను కోహెడకే తరలించాలి

- మంత్రి నిరంజన్‌రెడ్డికి పండ్ల వ్యాపారుల విజ్ఞప్తి

అబ్దుల్లాపూర్‌మెట్ : కోహెడలోని పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, బాటసింగారం నుంచి కోహెడకు మాత్రమే తరలించాలంటూ పండ్ల వ్యాపారుల అసోసియేషన్ నాయకులు సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రగతి ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జిన్నం వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహ, దిఫ్రూట్ కమిషన్ అండ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న తాత్కాలిక పండ్ల మార్కెట్ అందరికీ సౌకర్యవంతంగానే ఉందన్నారు. కొంతమంది తమ స్వలాభం కోసం మామిడిపల్లిలోనిది ప్రైవేటు మార్కెట్ అని అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ మార్కెట్ విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారే తప్ప, ఒకే మార్కెట్ నోటిఫైడ్ ఏరియాలో రెండు మార్కెట్లు ఉండాలని పేర్కొనలేదని



మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పండ్ల వ్యాపారుల అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. ఒకేచోట రెండు మార్కెట్లను విభజిస్తే రైతులు, కమీషన్‌దారులు నష్టపోతారని, అందుకే మామిడిపల్లిలో మార్కెట్‌ను అనుమతించొద్దని, కోహెడలో త్వరితగతిన మార్కెట్‌ను పూర్తి చేసి కమీషన్‌దారులకు దుకాణ స్థలాలను కేటాయించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మహేశ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, అనిల్, రవి, ప్రదీప్, రాహుల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలానికి 322 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదగిరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నెల 16 నుంచి 19 వరకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీబస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్,ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.ఎంజీబీఎస్ నుంచి శ్రీశైలం వరకు సూపర్‌లగ్జరీ రూ.600, డీలక్స్ రూ.540, ఎక్స్‌ప్రెస్ రూ.460 చొప్పున ఉంటుంది. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలం వరకు సూపర్ లగ్జరీ రూ.650, డీలక్స్ రూ.580. ఎక్స్‌ప్రెస్ రూ.500 చొప్పున చార్జీ ఉంటుంది. పూర్తి వివరాల కోసం ప్రయాణికులు ఫోన్ : 9959226250, 9959226257 నెంబర్లను సంప్రదించవచ్చు.

శాసనమండలికి పంపించండి

- పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

ఇబ్రహీంపట్నం: శాసనమండలికి పంపించండి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతానని పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. మండలంలోని దండుమైలారం, రాయపోల్, పొల్కంపల్లి, వినోభానగర్, ఎలిమినేడు, నల్లకంచె, చర్లపటేల్‌గూడ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, వారి సమస్యల సాధనకు తన జీవితాన్ని అంకితం చేస్తానని తెలిపారు. సీపీఎస్ రద్దు, పీఈటీ, పండిట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా



మాట్లాడుతున్న చెన్నకేశవరెడ్డి

అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితోపాటు నర్సింహారెడ్డి, పరమేష్, రాజు, రాజేశ్వర్‌రెడ్డి, మహేశ్, యాదగిరి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కస్తూర్బాలో కారం మెతుకులు

- కడుపు మంటతో అవస్థలు
- కలెక్టర్‌కు ఓ విద్యార్థిని ఫిర్యాదు

షాద్‌నగర్: విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలని ప్రభుత్వం ఓవైపు చెబుతోంది. కానీ కస్తూర్బాగాంధీ వసతి గృహంలో నిర్వాహకులు మాత్రం విద్యార్థినులకు కారం పొడితో భోజనం పెడుతున్నారు. ఫలితంగా చాలామంది కడుపు మంటతో ఇంటి బాట పడుతున్నారు. దీనిపై షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దలో ఉన్న కేజీబీవీ వసతి గృహానికి చెందిన ఓ విద్యార్థిని సోమవారం కలెక్టర్, స్థానిక ఎంఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దలో ఉన్న కేజీబీవీలో 6 నుంచి ఇంటర్ వరకు సుమారు 364 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కలెక్టర్‌కు ఫిర్యాదు

మొగిలిగిద్ద కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి అనారోగ్యానికి గురై షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఆమె సోమవారం కలెక్టర్, ఎంఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేజీబీవీలో కొంత కాలంగా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని.. ఉదయం వేళ అల్పాహారంలో కారం పొడితో, మధ్యాహ్నం నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారని, తాగునీరు కూడా సరిగా ఇవ్వడం లేదని ఫిర్యాదులో ఆరోపించింది. కారం పొడితో అన్నం పెడుతుండటంతో కడుపులో మంట, నొప్పి వంటి సమస్యలతో చాలామంది బాధపడుతున్నారని, ఇప్పటి వరకు సుమారు 20 మంది ఆరోగ్య సమస్యలతో ఇంటికి వెళ్లారని ఫిర్యాదులో పేర్కొంది. ఒక్కో తరగతి గదిలో సుమారు 40 మంది విద్యార్థులు ఉంటే కేవలం ఒక వాటర్ బాటిల్ మాత్రమే ఇస్తున్నారని, వీటిని ఉదయం నుంచి రాత్రి వరకు అందరం తాగుతున్నామని పేర్కొంది. ఈ విషయమై పాఠశాల ఇన్‌చార్జికి ఫిర్యాదు చేస్తే తమకే పనిష్మెంట్ ఇస్తుందని ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేసింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు స్టీరింగ్ ఫెయిల్
- డివైడర్‌ను ఢీకొట్టి ఆపిన డ్రైవర్
- 25 మంది ప్రయాణికులు సురక్షితం

ఇబ్రహీంపట్నం రూరల్: డ్రైవర్ చాకచక్యంతో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు అఫ్జల్‌గంజ్ నుంచి ఇబ్రహీంపట్నం వస్తోంది. సాగర్ హైవే మన్నెగూడ వద్దకు రాగానే బస్సు స్టీరింగ్ ఫెయిల్ అయ్యింది. దీంతో డ్రైవర్ చాకచక్యంగా నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బస్సును ఆపాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ శ్రీశైలంకు స్టీరింగ్ రాడ్ కడుపులో తగలడంతో స్వల్పంగా గాయపడ్డాడు. మూడు రోజుల నుంచి స్టీరింగ్‌లో సమస్యలు ఉన్నట్లు అధికారులకు చెప్పినా వారు పట్టించుకోలేదని డ్రైవర్ తెలిపాడు. ఈ కారణంగానే ప్రమాదం జరిగిందని తెలిపారు. సకాలంలో స్టీరింగ్ సమస్యను పరిష్కరించి ఉంటే ఇంత జరిగేది కాదని వాపోయారు.

కౌలు రైతులకు పట్టాలివ్వాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతులు

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా
- మద్దతు పలికిన పలు సంఘాల నేతలు

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములను కౌలు చేసుకొని జీవనోపాధి పొందుతున్న మాకే పట్టాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కౌలు రైతులకు మద్దతుగా రైతు, వ్యవసాయ కార్మిక, పలు అనుబంధ సంఘాల నేతలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వెంకటరాములు మాట్లాడారు. 70 ఏళ్లుగా ఓంకారేశ్వరాలయ భూముల్లో వందలాది మంది పేద రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. 1950లో రక్షిత కౌలుదారు చట్టం ప్రకారం రైతులకు 37 ఈ సర్టిఫికెట్లు ఉన్నాయని తెలిపారు. 38 ఈ ఇవ్వాల్సి ఉండగా అధికారుల దొంగతనంగా దేవాలయం పేరు మీద రికార్డులు మార్చేశారని అన్నారు. ప్రభుత్వం ఆ భూములను లాక్కోవాలని కుట్రలు చేస్తోందని ఆరోపించారు. దేవాలయ భూముల్లో కౌలు సాగు యోగ్యంగా మార్చుకోవడం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటాచారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.జగన్, జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, ప్రజా సంఘాల నేతలు రామకృష్ణారెడ్డి, ఆలంపల్లి నర్సింహ, సీహెచ్.జంగయ్య, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నారాయణపేట్ జిల్లా కోస్గీ మండలం, హనుమాన్‌పల్లికి చెందిన సవారీ అంజయ్య(38) సంవత్సరం క్రితం బతుకుదెరువు కోసం మండలంలోని దొంతాన్‌పల్లికి వచ్చాడు. దొంతాన్‌పల్లి శివారులోని సిమెంట్ బ్రిక్స్ బట్టీలో పని చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం 7గంటల ప్రాంతంలో దొంతాన్‌పల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అంజయ్య తలకు తీవ్ర గాయం కావడంతో నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



షాద్‌నగర్ రూరల్: మండలంలోని చింతగూడెం గ్రామ శివారులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద 75 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

టిప్పర్ బోల్తా



కేశంపేట: మండలంలోని లేమామిడి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున టిప్పర్ బోల్తా పడింది. ఆమనగల్ నుంచి షాద్‌నగర్ వైపు మట్టి తరలిస్తున్న టిప్పర్ అతివేగంగా వెళుతూ గ్రామ శివారులోని రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టి అదుపు తప్పి బోల్తా పడింది. పొలంలోని బోరు మోటారు దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు.

ఉత్సాహంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు..

SPL SAKSHI PREMIER LEAGUE SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP



గౌతమ్ కాలేజ్ జట్టు



జేఎన్‌టీయూ హైదరాబాద్ జట్టు

ఘట్‌కేసర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో గ్రేటర్ పరిధిలోని 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1లో
- మొదటి మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాగ్ యూనివర్సిటీ జట్టు 6.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసి విజయం సాధించింది.
- రెండో మ్యాచ్ జూనియర్ విభాగంలో తిరుమలగిరి గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ జట్టు 9.3 ఓవర్లలో 56 పరుగులు చేసి ఓటమిపాలైంది.
- మూడో మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుమల్‌గిరి గౌతమ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది. భవాన్స్ జట్టు క్రీడాకారుడు సాధిక్ 40 బంతుల్లో 118 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2
- మొదటి మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో శ్రీ దత్త డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ 5.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. అవినాశ్ జట్టు క్రీడాకారుడు సనద్ 23 బంతుల్లో 55 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో దిల్‌సుఖ్‌నగర్ అవంతి పీజీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–ఎ జట్టు 4.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 68 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడో మ్యాచ్ జూనియర్ విభాగంలో గౌతమ్ కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి పరాజయం పాలైంది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–3
- మొదటి మ్యాచ్‌లో శ్రీ అరబిందో జూనియర్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 56 పరుగులు చేసి పరాజయం పాలయ్యింది.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో జేఎన్టీయూ హైదరాబాద్‌హెచ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన కేపీఆర్ఐటీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడో మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద ఎ-జట్టు 10 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 141 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన జేఎన్టీయూ హైదరాబాద్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి ఓడింది. భవాన్స్ క్రీడాకారుడు నితీశ్ 31 బంతుల్లో 68 పరుగులు చేశాడు.

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...
- జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్, ఈసీఐఎల్ గౌతమ్ కాలేజ్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

లగ్న పత్రిక రాసుకొని వస్తుండగా..

- ఘోర రోడ్డు ప్రమాదం
- బాలుడు సహా ఇద్దరి దుర్మరణం
- ఒకరి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మాడ్గుల: బంధువు వివాహ లగ్నపత్రిక రాసుకొని వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడితో సహా ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని చంద్రాయన్‌పల్లి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సంద్రలగడ్డ తండాకు చెందిన నేనావత్ దినేష్‌కు ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన యువతితో వివాహం కుదిరింది. లగ్నపత్రిక రాసుకునేందుకు దినేష్ బంధువులు నేనావత్ పత్యానాయక్(42) అతని సోదరి వీ శాంతి(39), నేనావత్ అభి(5), వీ వెంకట్యానాయక్, నేనావత్ శంకర్, శారద తమ ఆటోలో మేడిగడ్డతండాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చంద్రాయన్‌పల్లి సమీపంలోని తానేషాపీర్ల గుట్ట వద్ద పత్తి లోడుతో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న నేనావత్ పత్యానాయక్, అతని సోదరి వీ శాంతి, సోదరుడి కుమారుడు నేనావత్ అభి అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. శాంతి తల శరీరం నుంచి వేరు కావడంతో సంఘటన స్థలం భయానకంగా మారింది. వీ వెంకట్యానాయక్ పరిస్థితి విషమంగా ఉండగా శంకర్, శారదకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

మహిళ అదృశ్యం



అనసూయ (ఫైల్)

మొయినాబాద్: కుటుంబ కలహాలతో గొడవ పడిన మహిళ కనిపించకుండా పోయింది. ఈ సంఘటన మండలంలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన ఖానపురం అనసూయ(48) ఈ నెల 4న కుటుంబ కలహాతో గొడవపడింది. అదేరోజు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికా రు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తలకొండపల్లికి చెందిన మాజీ కారోబార్, ముంతాపురం నరేందర్ (70) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. కొంత కాలంగా ఆయనకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని స్థానికులు తెలిపారు.

ముగ్గురు పిల్లలతో గృహిణి అదృశ్యం



పిల్లలతో గోపాలమ్మ

హయత్‌నగర్: ముగ్గురు పిల్లలతో సహా గృహిణి అదృశ్యమైన సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. పెద్దంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూరు లక్ష్మీభవానీ కాలనీకి చెందిన ఆది సుదర్శన్ సోదరి.. గోపాలమ్మ(24) భర్తతో గొడవపడి ముగ్గురుపిల్లలు కిట్టు(7), వర్ష(3), కావ్య(1.5)తో కలిసి కొంతకాలంగా సోదరుడి ఇంట్లో ఉంటుంది. ఈనెల 3న భర్త ఇంటికి వెళ్తున్నానని చెప్పి సోదరుడి ఇంటినుంచి బయటకు వెళ్లిన గోపాలమ్మ.. భర్త ఇంటికి వెళ్లలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసిన ఆఫలితం లేకపోవడంతో ఆమె సోదరుడు సుదర్శన్ సోమవారం హయత్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌నుంచి గోపాలమ్మ కుటుంబ సభ్యులకు కాల్ చేసి తాను కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్‌లో పిల్లతో కలిసి సురక్షితంగా ఉన్నానని తన అవసరాల కోసం డబ్బులు పంపాలని కోరినట్లు సమాచారం. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రక్షణ చర్యలు లేవంటూ ధర్నా



శ్రీనివాస్ (ఫైల్)



ధర్నా చేస్తున్న రంగాపూర్ వాసులు

కొత్తూరు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని పెంజర్ల కూడలి జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నందిగామ మండలం రంగాపూర్‌కు చెందిన తోట శ్రీనివాస్(51) కొత్తూరు వద్ద పెంజర్ల కూడలిలో కాలినడకన రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కూడళ్ల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ స్థానికులు రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అక్కడి నుంచి తరలించారు. అనంతరం షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ నాయుడు కూడలిని పరిశీలించారు. ప్రమాదాల నివారణకు కూడళ్ల వద్ద తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయండి




కలెక్టరేట్‌కు వెళుతున్న సేవాలాల్ సంఘం నాయకులు

గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్

కడ్తాల్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి(ఫిబ్రవరి 15)ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మానాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధంగా గిరిజన హక్కులు, సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ. 10లక్షలు ఇవ్వాలని కోరారు. గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని, గిరిజన బంధును అమలు చేయాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణకు ప్రతి జిల్లాకు రూ. 10 లక్షలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘురామ్‌రాథోడ్, జైపాల్, నరేశ్, కోట్యా నాయక్, శంకర్‌నాయక్, శ్రీను, శంకర్, పాండునాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు తరుణి



తరుణి

అబ్దుల్లాపూర్‌మెట్: బీహార్ రాష్ట్రం, పాట్నాలో ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెద్దఅంబర్‌పేటలోని రాజశ్రీ విద్య మందిర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని దంతూరి తరుణి ఎంపికయ్యారు. ఇటీవల నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 600 మీటర్ల పరుగు పందెం పోటీలో పాల్గొన్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ సీలేష్ తెలిపారు. పాఠశాల చైర్మన్ శ్రీ సిద్ధంకి జగన్మోహన్‌రెడ్డి సోమవారం తరుణిని అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరును తేవాలని సూచించారు.

రైతు సమస్యలపై ఉద్యమించాలి

మంచాల: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన పెట్టుబడి దారులకు న్యాయం చేసేలా చట్టాలు తీసుకురావడం దారుణమన్నారు. ఆరుగాలం కష్టపడి పని చేసే రైతులకు న్యాయం చేయకుండా నల్ల చట్టాలను తీసుకొచ్చి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే నిరసన రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, భిక్షపతి, వెంకటేష్, సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంచందర్